## స్వశక్తి సంఘాల పనితీరుపై అధ్యయనం

భీమదేవరపల్లి, జూన్, 19 : మండలంలోని స్వశక్తి సంఘాల పనితీరును గురువారం హెచ్‌సీఎల్ ఫౌండేషన్ సభ్యులు సందర్శించారు. ఆదర్శ సమాఖ్యల నిర్వహణపై జాతీయస్థాయి శిక్షణ కార్యక్రమం ఏపీఎంఎఎస్ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీ నుంచి 25 వరకు హైదరాబాదులో జరుగుతుంది. ఈ శిక్షణకు మహారాష్ట్రలోని ఎంఏవీఐఎం సంస్థ నుంచి 25మంది, హెచ్‌సీఎల్ ఫౌండేషన్ నుంచి ఆరుగురు హాజరయ్యారు. ఈ సందర్భంగా భరతమాత మండల సమాఖ్య, నవచైతన్య, హర్షిత గ్రామ సమాఖ్యలను వారు సందర్శించారు. స్వశక్తి సంఘాలు నిర్వహిస్తున్న కార్యక్రమాల అమలు తీరును పరిశీలించారు. కార్యక్రమంలో సెర్ప్ ఏపీడీ వెంకటేశ్వర్లు, డీపీఎం అనిల్‌కుమార్, ఏపీఎం దేవానంద్, కోటేశ్వర్, ఏపీఎంఎస్ మురళి, శ్రీనివాస్, అక్షయ పాల్గొన్నారు.

## బీసీల సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న తిరునహరి శేషు

హనుమకొండ, జూన్ 19 : కాంగ్రెస్ తన మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు బీసీ విద్యార్థులకు ఎలాంటి షరతులు లేకుండా పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలనే ప్రధాన డిమాండ్‌తో ఈ నెల 21న హనుమకొండ ఏకశిలా పార్క్‌లో జరిగే బీసీల సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయాలని బీసీ జాక్ రాష్ట్ర చైర్మన్ తిరునహరి శేషు పిలుపునిచ్చారు. దారబోయిన సతీశ్ అధ్యక్షతన సుబేదారిలో జరిగిన బీసీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ర్యాంకుతో సంబంధం లేకుండా బీసీ విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలన్నారు. పూలే విదేశీ విద్యా జ్యోతి పథకం ద్వారా విదేశాలకు పంపే బీసీ విద్యార్థుల సంఖ్యను 300 నుంచి 2వేలకు పెంచాలని, సంచార జాతుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో బీసీ నాయకులు నూతనకంటి ఆనందం, పాలడుగుల సురేందర్, ఎర్రబొజ్జు రమేశ్ పాల్గొన్నారు.

## ఆర్జేడీని వెంటనే తొలగించాలి

హనుమకొండ చౌరస్తా, జూన్ 19 : ఉమ్మడి జిల్లాలోని జూనియర్ కాలేజీల్లో కనీస సదుపాయాలు లేవని, వరంగల్ నగరంలో విచ్చలవిడిగా అనుమతులు లేకుండా కళాశాలలను నడిపిస్తున్నారని, విద్యార్థుల సమస్యలను పట్టించుకోని వరంగల్ జిల్లా ఆర్జేడిని పదవి నుంచి వెంటనే తొలగించాలని స్వేరో స్టూడెంట్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎల్తూరి సాయికుమార్ డిమాండ్ చేశారు. గురువారం ఉదయం నుంచి జయప్రదభాయ్ అందుబాటులో లేకపోవడంలో హైదరాబాద్‌లోని ఆఫీసుకు వెళ్లామని, విద్యార్థి సంఘాలు అని చెప్పినా అనుమతించకపోవడంతో ఆర్జేడీ బోర్డు శిలాఫలకానికి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ సమస్యలను పట్టించుకోని, కాలేజీలపై చర్యలు తీసుకోని జయప్రదభాయ్‌ని వెంటనే పదవి నుంచి తొలగించాలని కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు.

## 22న ఒలింపిక్ రన్

హనుమకొండ చౌరస్తా, జూన్ 19 : ఉమ్మడి వరంగల్ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 22న హనుమకొండలో జరిగే ఒలింపిక్ రన్‌ను విజయవంతం చేయాలని ఉమ్మడి వరంగల్ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ అజీజ్‌ఖాన్ పిలుపునిచ్చారు. ఈ రన్ ఉదయం 6.45లకు కాళోజీ జంక్షన్ నుంచి మొదలై అంబేద్కర్ జంక్షన్, పబ్లిక్‌గార్డెన్, ఏషియన్ మాల్ మీదుగా జేఎన్ఎస్‌లో ముగుస్తుందన్నారు. క్రీడా సంఘాల సభ్యులు, క్రీడాకారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## 24 నుంచి పాలిసెట్ కౌన్సెలింగ్

హనుమకొండ చౌరస్తా, జూన్ 19 : టీజీ పాలిసెట్–2025 అడ్మిషన్ కౌన్సెలింగ్ ఈనెల 24వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ బైరి ప్రభాకర్ తెలిపారు. విద్యార్థులు సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ ఇంజినీరింగ్, మైనింగ్, కెమికల్, ఫుడ్ టెక్నాలజీ, టెక్స్‌టైల్, ప్లాస్టిక్ టెక్నాలజీ తదితర డిప్లొమా కోర్సుల్లో ప్రవేశం పొందొచ్చని, ఈ కోర్సులు విద్యార్థుల నైపుణ్యాలను అభివృద్ధి చేసి పరిశ్రమల్లో ఉపాధికి మార్గం కల్పిస్తాయని తెలిపారు. వివరాలకు https://tgpolycet.nic.in వెబ్‌సైట్‌ను పరిశీలించాలని కోరారు.

# స్విమ్మింగ్‌పూల్ పనులను వేగంగా పూర్తి చేయాలి

**గ్రేటర్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్**


ప్లానిటోరియం పైకప్పును పరిశీలిస్తున్న కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, అధికారులు

వరంగల్,జూన్ 19 : కార్పొరేషన్ ఆవరణలోని ఇండోర్ స్టేడియం పక్కన నిర్మిస్తున్న స్విమ్మింగ్ పూల్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని గ్రేటర్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. గురువారం స్విమ్మింగ్ పూల్‌తో పాటు ప్లానిటోరియం, శివనగర్ ప్రాంతంలోని మెట్ల బావి, చింతగట్టులోని పద్మశాలీ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను కమిషనర్ పరిశీలించారు. పనులు నిర్దేశిత గడువులోగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్లానిటోరియం మిషన్ల కొనుగోలు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. పరిపాలనా భవనం అనుమతులు ఈఎన్‌సీ వద్ద పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు తెలుపగా, అనుమతులు రాగానే పనులు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎస్ఈ శ్రీనివాస్, ఈఈ రవికుమార్, మాధవీలత, డీఈలు రాజ్‌కుమార్, ఏఈ శ్రీకాంత్, ముజామిల్, హబీబ్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

## 23 వరకు గురుకుల డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు

హసన్‌పర్తి, జూన్ 19 : మండలంలోని జయగిరి రోడ్డులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల (భూపాల్‌పల్లి)లో డిగ్రీలో ఈనెల 23వ తేదీ వరకు అడ్మిషన్లు ఇస్తామని ప్రిన్సిపాల్ విజయలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1.5 లక్షలు, పట్టణ ప్రాంతాల వారికి రూ.రెండు లక్షల మించకుండా ఉండాలన్నారు. ఎంపీసీ, ఎంపీసీఎస్, ఎంఎస్‌టీడీఎస్, బీజెడ్‌సీ, ఎంజెడ్‌సీ, బీకాం (సీఏ), బీకాం (బీఏ) కోర్సులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు పదోతరగతి, ఇంటర్ మార్కుల మెమో (ఒరిజినల్), ఆదాయం, కుల ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డు జిరాక్స్, 5 పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు తీసుకొని కళాశాలకు రావాలన్నారు. వివరాలకు 9121004528, 7013464418, 9502835848 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

## 3,228మంది విద్యార్థులకు నూతన ప్రవేశం

**ముగిసిన బడిబాట : డీఈవో**

హనుమకొండ చౌరస్తా, జూన్ 19 : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని తరగతుల్లో కలిపి 3,228 విద్యార్థులు నూతనంగా ప్రవేశం పొందినట్లు జిల్లా విద్యాశాఖధికారి వాసంతి తెలిపారు. ఒకటో తరగతిలోనే 1,133 మంది విద్యార్థులు ప్రవేశం పొందారని, 2 నుంచి 5వ తరగతిలో 669, 6వ తరగతిలో 981, 7వ తరగతి నుంచి పదో తరగతి వరకు 445 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారని పేర్కొన్నారు. జిల్లాలోని స్థానిక సంస్థలు, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు వేసవిలోనే బడిబాట చేపట్టారని, తల్లిదండ్రులు, మహిళా సమాఖ్య సభ్యులు, అంగన్‌వాడీ ఉపాధ్యాయుల సహకారంతో బడిబాట నిర్వహించినట్లు తెలిపారు. జూన్ 6న గ్రామసభతో బడిబాట ప్రారంభమై గురువారం పాఠశాలల క్రీడలతో ముగిసినట్లు చెప్పారు. ఇప్పటి వరకు విద్యార్థుల హాజరు 70 శాతం ఉందని, ఈ వారంలో అందరూ హాజరవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. కలెక్టర్ ఆదేశానుసారం విద్యా సంవత్సరం ప్రారంభంలోనే జిల్లా స్థాయి, మండలస్థాయి, గ్రామస్థాయిలో వివిధ విభాగాల అధికారులతో సమన్వయ సమావేశాలు ఏర్పాటు చేసి బడిబాటలో భాగస్వాములను చేశామని చెప్పారు. బడిబాట ముగిసినప్పటికీ విద్యార్థుల నమోదు ప్రక్రియ కొనసాగుతుందన్నారు. నమోదు సంఖ్య 4000 దాటొచ్చని చెప్పారు.

## 24న వాహనాల బహిరంగ వేలం

నయీంనగర్, జూన్ 19 : జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి ఆధీనంలో పనిచేయని స్థితిలో ఉన్న మూడు 104 వాహనాలను ఈ నెల 24న బహిరంగ వేలం వేస్తున్నట్లు డీఎంహెచ్‌వో అప్పయ్య ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయం, వరంగల్ గౌతమీనగర్, డాక్టర్ కాలనీ ఆవరణలో మూడు 104 సంచార వాహనాలకు మంగళవారం ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం వేయనున్నట్లు తెలిపారు. ఒక్కో వాహనం ధర 1,30,000గా నిర్ణయించామన్నారు. వేలంలో పాల్గొనే వారు రూ.20,000 డిపాజిట్‌గా చెల్లించాలన్నారు.

## రెడ్‌క్రాస్ సేవలు వినియోగించుకోవాలి

దామెర, జూన్ 19 : మండలంలోని ల్యాదెళ్ల గ్రామంలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామంలోని 112మందికి బీపీ, షుగర్, రక్త పరీక్షలను ఉచితంగా చేసి మందులు అందించారు. రెడ్‌క్రాస్‌కు చెందిన డాక్టర్ మోహ్మద్ తయార్, సిబ్బంది శివకుమార్, గంగాధర్, ఖలీం, నర్సింహాచారి పాల్గొన్నారు.

## అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవాలి

శాయంపేట, జూన్ 19 : క్రీడా పాఠశాలల్లో అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి గడ్డం భిక్షపతి అన్నారు. మండల స్థాయి స్పోర్ట్స్ స్కూల్ సెలక్షన్స్ ఈ నెల 21న శాయంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనేందుకు నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. పూర్తి వివరాలకు 9848506098,9912796596లో సంప్రదించాలని కోరారు.

**ఘనంగా క్రీడా దినోత్సవం..**

మండలంలోని పెద్దకోడెపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బడిబాటలో భాగంగా క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎంఈవో మాట్లాడుతూ.. క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శరీర పటిష్టతకు దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో ఏఏపీ చైర్మన్ వసంత, కార్యదర్శి సునీల్, హెచ్‌ఎం, పీడీ జ్యోతి పాల్గొన్నారు.

## ఎల్కతుర్తిలో ట్రిపుల్ ఐటీ ఏర్పాటు చేయాలి

ఎల్కతుర్తి, జూన్ 19 : ఎల్కతుర్తిలో బాసర ట్రిపుల్ ఐటీకి అనుబంధ శాఖను ఏర్పాటు చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఎల్కతుర్తిలో వారు మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. బాసర ట్రిపుల్ ఐటీకి అనుబంధంగా మహబూబ్‌నగర్, ఎల్కతుర్తిల్లో అనుబంధ శాఖలను ఏర్పాటు చేస్తే విద్యార్థులకు మేలు జరుగుతుందన్నారు. రైతులు సైతం భూములు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని, మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఇటీవల కొందరు ట్రిపుల్ ఐటీ రావడం లేదని చెబుతుండడంతో విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. సమావేశంలో మండల కార్యదర్శి శనిగరపు రాజ్‌కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, మర్రి శ్రీనివాస్, మర్రి విజయ్, వేముల కృష్ణాకర్, పానుగంటి రాజిరెడ్డి పాల్గొన్నారు.

## కల్వర్టు పూడ్చిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి


ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

కమలాపూర్, జూన్ 19 : మండలంలోని మర్రిపల్లి గూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని జూజునూర్ పల్లిలో డ్రైనేజీ నీళ్లు వెళ్లే కల్వర్టును పూడ్చివేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు గురువారం ఆందోళనకు దిగారు. వర్షం కురిస్తే వరద నీరు ఇండ్లలోకి వచ్చే అవకాశం ఉందన్నారు. ఆర్ అండ్ బీ రహదారిపై వరద నీరు పోయేందుకు నిర్మించిన కల్వర్టును ఆక్రమించి మట్టితో పూడ్చివేశారని, అతడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, ప్రిన్సిపాల్ జ్యోతి

## ఆర్ట్స్ కాలేజీ డిగ్రీ సెమిస్టర్ పరీక్ష ఫలితాల విడుదల

హనుమకొండ చౌరస్తా, జూన్ 19 : కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ, 2,4,6 సెమిస్టర్ పరీక్ష ఫలితాలను కేయూ వీసీ ప్రతాపరెడ్డి గురువారం విడుదల చేశారు. రిజిస్ట్రార్ ఆచార్య రామచంద్రం, పరీక్షల నియంత్రణ అధికారి రాజేందర్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి, వైస్ ప్రిన్సిపాల్ రెహమాన్‌తో కలిసి ఆయన ఫలితాలు ప్రకటించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. స్వయం ప్రతిపత్తి గల కాలేజీలో ఫలితాలు వెనువెంటనే విడుదల చేస్తున్నామన్నారు. రెండో సెమిస్టర్‌లో 1,255 మంది విద్యార్థులకు 1,236 మంది పరీక్ష రాయగా 620 మంది (50.16శాతం) ఉత్తీర్ణత సాధించారు. 4వ సెమిస్టర్ లో 952 మంది రిజిస్టర్ చేసుకోగా 927 మంది పరీక్ష రాయగా 540 మంది విద్యార్థులు (58.25 శాతం) ఉత్తీర్ణులయ్యారు. 6వ సెమిస్టర్‌లో 765 మందికి 742 మంది పరీక్ష రాయగా, 582 మంది విద్యార్థులు (78.44 శాతం) ఉత్తీర్ణత సాధించారన్నారు. ఓవరాల్‌గా 59.97 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కాలేజీ అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్రీలత, పరీక్షల నియంత్రణ అధికారి సుధీర్, గిరిప్రసాద్ పాల్గొన్నారు.

**కేయూలో వాటర్‌ప్లాంట్ ప్రారంభం..**

కాకతీయ విశ్వవిద్యాలయ హాస్టల్ విద్యార్థుల సౌకర్యార్థం ఆర్‌వో ప్లాంట్ యూనిట్లను వీసీ ప్రారంభించారు. ఇంజినీరింగ్ కాలేజీ హాస్టల్‌లో ఆర్‌వో ప్లాంట్ గంటకు 200 లీటర్ల సామర్థ్యంతో మంచినీటిని అందిస్తుందని, పద్మాక్షి మహిళా హాస్టల్ ప్లాంట్ గంటకు 500 లీటర్ల సామర్థ్యంతో పని చేస్తుందని, సుబేదారిలోని న్యాయ కళాశాల హాస్టల్‌లో ప్లాంట్ గంటకు 200 లీటర్ల సామర్థ్యంతో మంచి నీటిని అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో హాస్టల్ డైరెక్టర్ రాజ్ కుమార్, వెంకట్రామరెడ్డి, సవితా జ్యోత్స్న, మల్లికార్జున రెడ్డి, వాసుదేవారెడ్డి, సుజాత, నరేందర్, బీసీఎం రాజు పాల్గొన్నారు.

**దూరవిద్యలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల..**

కాకతీయ విశ్వవిద్యాలయం దూరవిద్యా కేంద్రంలో పీజీ, డిగ్రీ, డిప్లొమా, సర్టిఫికెట్, ఓరియంటేషన్ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేశారు. ప్రవేశాలకు సంబంధించిన పోస్టర్లను వీసీ, రిజిస్ట్రార్, దూరవిద్యా కేంద్ర సంచాలకుడు సురేశ్‌లాల్ ఆవిష్కరించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఈ నెల 20 నుంచి జూలై 31వ తేదీ వరకు సమర్పించవచ్చని, ఇతర వివరాలకు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ చూడాలని వెల్లడించారు. కార్యక్రమంలో దూరవిద్యా కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్, పద్మజ, మల్లేశ్వర్, నల్లాని శ్రీనివాస్, జగన్, కొట్టె భాస్కర్ పాల్గొన్నారు.

## 'ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు కేయూ భూములు ఇవ్వొద్దు'

హనుమకొండ చౌరస్తా, జూన్ 19 : కాకతీయ యూనివర్సిటీకి చెందిన 15 ఎకరాల భూములను వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ స్కూల్ నిర్మాణానికి కేటాయిస్తూ తీసుకొన్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. వర్సిటీ అతిథి గృహంలో విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడారు. యూనివర్సిటీ భూముల పరిరక్షణకు అధికారులు చర్యలు తీసుకోవాలని, గతంలో కూడా అన్యాక్రాంతానికి గురైన భూముల హద్దులు నిర్ణయించి ప్రహరీ నిర్మించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో విద్యార్థి సంఘాల నాయకులు నరసింహారావు, శ్రావణ్, స్టాలిన్, పస్తం అనిల్, సనత్, జయసూర్య, మర్రి మహేశ్, శివ, మధు, శివ, జశ్వంత్, గణేశ్ పాల్గొన్నారు.

## జ్యోతిర్లింగ యాత్రకు స్పెషల్ రైలు

కాజీపేట, జూన్ 19 : ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో జూలై 19న దివ్య దక్షిణ్ జ్యోతిర్లింగ, భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ అధికారి శ్రీధర్ ప్రకటనలో కోరారు. ఈ రైలు సికింద్రాబాద్‌లో బయలు దేరి అరుణాచలం, రామేశ్వరం, మధురై, కన్యాకుమారి, త్రివేండ్రం, తిరుచ్చి, తంజావూర్‌లో దైవ దర్శనాల (7 రాత్రులు, 8 పగళ్లు) అనంతరం జూలై 26న సికింద్రాబాద్‌కు చేరుకుంటుందన్నారు. పెద్దలకు సాధారణ టికెట్ ధర రూ.14,100, 3ఏసీకి రూ.22,300, 2 ఏసీకి రూ.29,300 ఉంటుందని తెలిపారు. రైలు జనగామ, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, మధిర, విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట మీదుగా వెళ్తుందన్నారు. వివరాలకు 04027702407, 9701360701, 9281495845, 9281495843, 8287932228 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

# వానకాలం సాగుకు సన్నద్ధం

- పొలాలను దున్నుతున్న రైతులు
- ప్రభుత్వ ప్రోత్సాహం కరువైందని అన్నదాతల ఆవేదన
- సన్నాలకు బోనస్ డబ్బులు ఎప్పుడు వస్తాయని ఎదురుచూపులు


ఉప్పల్‌లో వరినాటు వేసేందుకు పొలం దున్నుతున్న రైతు

కమలాపూర్, జూన్ 19 : వర్షాలు సకాలంలో కురుస్తుండడంతో వానకాలం సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. కాలం కరుణించినా ప్రభుత్వ ప్రోత్సాహం కరువు కావడంతో ఆదిలోనే అష్టకష్టాలు పడుతూ అన్నదాతలు సాగువైపు అడుగులు వేస్తున్నారు. పెట్టుబడి కోసం రైతుభరోసా ఇవ్వకపోవడం, యాసంగిలో అమ్ముకున్న సన్నాలకు బోనస్ వేయకపోవడంతో అప్పు కోసం బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. మండలంలో వరి, పత్తి, మిరప, మక్కజొన్న పంటలు సాగు చేస్తున్నారు. 18వేల ఎకరాల్లో వరి, 4,500 ఎకరాల్లో పత్తి, 80 ఎకరాల్లో మక్కజొన్న, 70 ఎకరాల్లో మిరప సాగు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. కాంప్లెక్స్ ఎరువుల బస్తాలు అందుబాటులో ఉన్నా ప్రభుత్వం యూరియా ఉత్పత్తి తగ్గించి కొరత సృష్టించినట్లు తెలుస్తోంది. వ్యవసాయబావుల ఆధారిత ఆయకట్టు రైతులు వరినాటు వేసేందుకు పొలాలు దున్నుతున్నారు. చెరువుల ఆధారిత ఆయకట్టు రైతులు నారుమడులు సిద్ధం చేసుకుంటున్నారు. కాగా, సీజన్ ప్రారంభమైనా ప్రభుత్వం ఎలాంటి సాగు ప్రణాళిక రూపొందించ లేదనే విమర్శలున్నాయి. ఏ సీజన్‌లో ఎలాంటి పంటలు వేస్తే అధిక దిగుబడులు వస్తాయో? రైతులకు అవగాహన కల్పించడంలో విఫలమైందనే ఆరోపణలున్నాయి.

**సన్నాలకు బోనస్ ఇంకా పడలే..**

**- గొట్టెముక్కుల శ్రీనివాస్‌రెడ్డి, రైతు, భీంపల్లి**



గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం సీజన్ ప్రారంభం కాకముందే రైతు బంధు డబ్బులు వేసేది. కానీ ప్రస్తుతం సీజన్ ప్రారంభమై వరినాటు వేసేందుకు దుక్కులు దున్నుతున్నా స్పందన లేదు. ఎరువులు తెచ్చుకొనేందుకు క్రాప్‌లోన్ కోసం బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నం. నాకు రెండు ఎకరాల భూమి ఉన్నది. వరినాటు వేసేందుకు పొలం దున్నుతున్న. ప్రభుత్వం ఎప్పుడు రైతు భరోసా వేస్తుందోనని వేచి చూస్తున్న. సన్నాలకు బోనస్ ఇస్తమన్నరు. యాసంగి అయిపోయినా బోనస్ పడతలేదు.

## ప్రభుత్వ కార్యాలయాల పరిశీలన


చైల్డ్‌కేర్ సెంటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

హనుమకొండ, జూన్ 19 : కలెక్టరేట్‌లోని పలు ప్రభుత్వ కార్యాలయాలను కలెక్టర్ స్నేహ శబరీష్ గురువారం పరిశీలించారు. పరిపాలనా విభాగం, డీ, ఈ సెక్షన్లతో పాటు ఎలక్షన్ సెల్, మినీ కాన్ఫరెన్స్ హాల్, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్, చైల్డ్ కేర్ సెంటర్, రికార్డు రూమ్, ఎన్ఐసీ, వీడియో కాన్ఫరెన్స్ హాల్‌ను సందర్శించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఆర్వో వైవీ గణేశ్, కలెక్టరేట్ ఏవో గౌరీశంకర్ ఉన్నారు.

**కలెక్టర్‌ను కలిసిన సీనియర్ సిటిజన్స్..**

కలెక్టర్‌ను గోపాలపురం సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. కలెక్టరేట్‌లోని చాంబర్‌లో ఆమెను కలిసి శుభాకాంక్షలు తెలిపి సీనియర్ సిటిజన్స్ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. కార్యదర్శి తేరాల యుగంధర్, చితురాల సత్యనారాయణ, మార్క రవీందర్‌గౌడ్, గంగారపు యాదగిరి, తాడూరి లక్ష్మీనారాయణ ఉన్నారు.

## 58వ జీవో ప్రకారం ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలి

హనుమకొండ, జూన్ 19 : హనుమకొండలోని భగత్‌సింగ్‌నగర్, పలివేల్పుల గ్రామంలో 2007 నుంచి నివాసం ఉంటున్న 200 కుటుంబాలకు వెంటనే 58వ జీవో ప్రకారం ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం జిల్లా కమిటీ సభ్యుడు గుమ్మడిరాజుల రాములు ఆధ్వర్యంలో హనుమకొండ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఆధార్, రేషన్ కార్డులు, ఓటర్ ఐడీలు, ఇంటి పన్ను రసీదులు, కరెంట్ బిల్లులు వంటి ఆధారాలున్నా ఇప్పటివరకు పట్టాలు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. వెంటనే సర్వే జరిపించి పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మంద సుచందర్, వేలు సుమన్, సాదు సుధాకర్, కుర్ర పద్మావతి, తన్నీరు భూలక్ష్మి, జడ అశ్విని పాల్గొన్నారు.

## మిమిక్రీ కళను విశ్వవ్యాప్తం చేసిన మహనీయుడు నేరెళ్ల వేణుమాధవ్

హనుమకొండ చౌరస్తా, జూన్ 19 : మిమిక్రీ కళను విశ్వవ్యాప్తం చేసిన మహనీయుడు పద్మశ్రీ నేరెళ్ల వేణుమాధవ్ అని కేంద్ర పురస్కార్ అవార్డు గ్రహీత, ప్రముఖ కవి, రచయిత అంపశయ్య నవీన్ అన్నారు. నేరెళ్ల వేణుమాధవ్ 8వ వర్ధంతి సందర్భంగా హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేరెళ్ల వేణుమాధవ్ ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది కళాకారులను తీర్చిదిద్దారన్నారు. యూఎన్‌వోలో మిమిక్రీ చేసిన మొదటి భారతీయుడిగా గుర్తింపు సాధించారన్నారు. అనంతరం మిమిక్రీ కళాకారులు ముజ్జిక సదాశివరావు, దామోదర్, ఎస్కే బాబర్, పిండి బ్రాహ్మనందస్వామి సినీ ప్రముఖులతో పాటు పక్షుల గళాలను వినిపించి ఆహుతులను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో నేరెళ్ల వేణుమాధవ్ కొడుకు రాధాకృష్ణ, కోడలు శ్రీలత, కవులు రామా చంద్రమౌళి, పొట్లపల్లి శ్రీనివాస్‌రావు, తోట పూర్ణచందర్ పాల్గొన్నారు.

## తపాలా సేవలను సద్వినియోగం చేసుకోండి

నయీంనగర్, జూన్ 19 : తపాలా సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీవైఎస్‌వో అశోక్ నాయక్ కోరారు. హనుమకొండలోని ప్రధాన తపాలా కార్యాలయంలో డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా గురువారం వివిధ పొదుపు పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం సామాన్య ప్రజలకు అందుబాటులోకి అనేక సేవలను తీసుకొచ్చిందన్నారు. పార్సిల్ బుకింగ్, ప్యాకింగ్ సదుపాయం, జీవిత బీమా, యాక్సిడెంట్ ఇన్సూరెన్స్, ఆధార్ నమోదు, సవరణ, రైల్వే రిజర్వేషన్ సర్వీస్, పాస్‌పోర్టు తదితర సేవలు అందిస్తామని తెలిపారు. అసిస్టెంట్ సూపరిటెండెంట్ మూల రమాదేవి, పోస్ట్‌మాస్టర్ పవన్ కుమార్ పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల బిల్లులు చెల్లించాలి

**మండలంలో పలు అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే కడియం**

వేలేరు, జూన్ 19 : ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధికారులను ఆదేశించారు. మండలంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మండలంలోని పైలట్ గ్రామం శాలపల్లిలో సూమారు 79 మంది లబ్ధిదారులకు ఇండ్లు మంజూరు కాగా 36మంది గృహ నిర్మాణాలు చేపట్టారు. అయితే వారిలో ఆరుగురికి మాత్రమే బిల్లులు రావడంతో ఎమ్మెల్యే హౌసింగ్ కార్పొరేషన్ డీఈ, ఏఈలను పిలిచి బిల్లులు ఎందుకు చెల్లించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**132/33 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణ పనుల పరిశీలన..**

పీచర శివారులో 132/33 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. పనుల్లో జాప్యం జరుగుతుండడంతో కొంత అసహనం వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్‌కు ఫోన్ చేసి రెండు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. సుమారు రూ.100కోట్లతో 220/33కేవీ సబ్ స్టేషన్ ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం పీచరలో రూ.50లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. పీచరలో 43 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా, గ్రామస్తుల కోరిక మేరకు మరో 25 ఇండ్లు మంజూరు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ హెచ్ కొమి, ఎంపీడీవో లక్ష్మీప్రసన్న, హౌసింగ్ కార్పొరేషన్ డీఈ సిద్ధార్థ నాయక్, ఎంపీవో భాస్కర్, నాయకులు బిల్లా యాదగిరి, మల్లిఖార్జున్, రాజిరెడ్డి, రవీందర్ యాదవ్, లక్ష్మణ్ నాయక్ పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనం తనిఖీ

నడికూడ, జూన్ 19 : జిల్లా పరిషత్ సీఈవో విద్యాలత మండల పరిషత్ కార్యాలయాన్ని గురువారం తనిఖీ చేశారు. మండల కేంద్రంలో స్వచ్ఛభారత్ మిషన్ కమ్యూనిటీ సోక్ పిట్స్‌ను ప్రారంభించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం తయారీని పరిశీలించారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన ధరల పట్టిక ఫ్లెక్సీని పరిశీలించారు. గ్రామ పంచాయితీ నర్సరీని సందర్శించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గజ్జల విమల, ఎంపీవో రవి, ఎంఈవో హనుమంతరావు, పంచాయతీ కార్యదర్శి భిక్షపతి పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సును పరిశీలించిన ఆర్డీవో

ఎల్కతుర్తి, జూన్ 19 : మండలంలోని దామెర గ్రామంలో గురువారం జరిగిన రెవెన్యూ సదస్సును ఆర్డీవో రమేశ్‌రాథోడ్ పరిశీలించారు. రెవెన్యూ సదస్సుకు వస్తున్న అర్జీల గురించి తెలుసుకున్నారు. దరఖాస్తులు సమర్పించిన ప్రతి ఒక్కరికి రసీదు అందించాలని సిబ్బందికి సూచించారు. కోర్టు కేసుల్లో ఉన్న దరఖాస్తులు తప్ప మిగతా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ జగత్‌సింగ్, నాయబ్ తహసీల్దార్ భద్రూనాయక్, ఆర్ఐలు సదానందం, భరత్ పాల్గొన్నారు.


**సమస్యల పరిష్కారానికే సదస్సులు..**

ఆత్మకూరు : భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేస్తున్నామని తహసీల్దార్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఆత్మకూరు జరిగిన సదస్సులో రైతుల వద్ద నుంచి 405 దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ భాస్కరాచారి, ఎంఆర్ఐ ఫరక్, ఆర్ఐ హారిక పాల్గొన్నారు.

**దరఖాస్తు గడువు పెంచాలి..**

శాయంపేట : భూ భారతి దరఖాస్తుల గడువును పెంచాలని బహుజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రభావతికి వినతిపత్రం అందజేశారు. బీఎస్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మారెపల్లి క్రాంతికుమార్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సుమన్ మాట్లాడుతూ.. చాలామంది పేద రైతులు ఎలా చేసుకోవాలో తెలియక దరఖాస్తు చేయలేదన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు మారెపల్లి విజయ్‌కుమార్, కిరణ్, భాను పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో రైతు మృతి


రవీందర్‌రెడ్డి (ఫైల్)

హసన్‌పర్తి, జూన్ 19 : విద్యుదాఘాతంలో రైతు మృతి చెందిన ఘటన మండలంలోని సీతానాగారంలో గురువారం జరిగింది. సీఐ చేరాలు తెలిపిన వివరాల ప్రకారం .. గ్రామానికి చెందిన సూదుల రవీందర్‌రెడ్డి (59) బుధవారం ఉదయం తన వ్యవసాయ భూమి వద్ద వరి నాటుకు నీరు పెట్టేందుకు వెళ్లి స్టార్టర్ ఆన్ చేస్తున్న క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై కిందపడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఎంజీఎం దవాఖానకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

NAMASTHE TELANGANA CLASSIFIEDS
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**WANTED**

★ఎలాంటి విద్యార్హత లేకున్నా ఫర్వాలేదు. మంచి వాక్చాతుర్యం కలిగినవారు మా సంస్థలో మార్కెటింగ్ చేయుటకు అనుభవం ఉన్నవారికి ఇదే మా ఆహ్వానం. 7981217883. NT-325336

★ఉమ్మడి వరంగల్ జిల్లాలో 10th, ఇంటర్, డిగ్రీ పాసైనవారు అర్హులు. ఆకర్షణీయమైన జీతం రూం+భోజనం ఫ్రీ, ఇన్సెంటివ్స్ కలవు. సెల్: 7337378927, 7842425065. NTW-337101

**BUSINESS OFFER**

★Need Monthly Returns? Get your Own International Capital Market Trading Account. Profit Sharing/Fixed Returns, Safe & Secure. 6301859174. NT-325295

**CHANGE OF NAME**

I, NANEVENI SWARUPA, D/o. RAJU R/o H.No. 5-12/A, Roheer Village, Eturnagaram Mandal, Mulugu Dist.-506165. Solemnly declared that I have changed my name from KAGITHA SARITHA, W/o. MOGALI to NANEVENI SWARUPA, D/o. RAJU for all future purposes.

**CHANGE OF NAME**

★I, Fathima Begum, W/o. Mohammed Akheel Ahmed, R/o: H.No. 11-23-2192, Teachers Colony, LB Nagar, Warangal Dist-506002, T.G. Have Changed my Minor Daughter name from AYESHA HIBA to AYESHA HUDA D/o. MOHAMMED AKHEEL AHMED for all future purposes. NTW-000

★I, MOHAMMADI BEGUM W/o MOHAMMED SALEEM R/o 15-4-479, Papaiahpet Chaman, Warangal-506002. Solemnly declared that I have changed my name from MAHAMMADI BEGUM to MOHAMMADI BEGUM for all future purposes. NTW-000

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

NAMASTHE TELANGANA CLASSIFIEDS
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే

ప్రకటనల విభాగం : 9182777552

HANAMKONDA 9182777563
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777135
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565